# 9

# ప్రపంచం తగలబడిపోతోంది

నేను అతని గుమ్మంలో అడుగుపెట్టాను.

సరిగ్గా ఆ సమయానికే ధర్మరాజు "గ్లోబు" పై కిరోసిన్ పోసి అగ్గిపుల్ల గీస్తున్నాడు.

నేను చూస్తుండగానే భూగోళం బొమ్మ అంటుకుని భగభగ మండుతూ-

మంటలు.... మంటలు.... మంటలు...

మంటల్లో దేశాలకు దేశాలు...

ప్రపంచం తగలబడిపోతోంది.

చూస్తున్నాను అవాక్కయి మంటల్లోకి... ఆ దృశ్యాన్ని భరించలేక పోతున్నాను.

ధర్మరాజు ఖద్దరు బట్టల కరకరల్తో కొత్త వంద రూపాయల నోటులా వున్నాడు.

తలెత్తి నన్ను చూచి- "ఎంత సేపైందోయ్ వచ్చి" అని పరమ వికారంగా, గట్టిగా, అకారణంగా నవ్వాడు.

"ఇప్పుడే" అన్నాను. నా గొంతు కాలిక్రింద పడ్డ చీమ రోదనలా నాకే వినిపించలేదు.

"ఈ గ్లోబును పదేళ్ళ క్రితం కొన్నాను వెధవది రంగు వెలిసిపోయింది. టేబుల్‌పై యిదుంటే అందమైన పసివాడు ముఖానికి సిరాపూసుకున్నట్టు అతిరోతగా ఉంది. దీన్ని తీసేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను. యిప్పుడు దొరికింది అవకాశం. అసలు మురుక్కాలువలో పారేద్దామనుకున్నాను మొదట. కాని మురుగులో భూగోళాన్ని ముంచటం యిష్టంలేక"

"తగులబెడ్తున్నారా..."

"కొద్దిగా బెటర్‌గదా...అందుకని..." మళ్ళా యికిలించాడు ఎలుగు బంటిలా.

భూగోళం కాలడం, బూడిదగా మారడం పూర్తయింది.

"యింతకూ నువ్విప్పుడు అంతా తయారై వచ్చినట్టేనా..." అని చేతులను అతి నాజూగ్గా దులుపుకుని- "క్యాష్‌గిట్లు... అవన్నీ...."

"ఆఁ... తయారయ్యే వచ్చాను. కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కింకా పదిహేన్నిమిషాలుంది.... టికెట్లు కూడా తీసుకున్నాను..."

"వెరీగుడ్.... సో, వెళ్దామా.... ఏమోయ్... వెళ్తున్నాను...." అని యిల్లదిరిపడేలా అరిచి బయలుదేరాడు బయటికి

రోడ్డుపైకి రాగానే "ఏయ్ టాక్స్" అని కేకేశాడు.

నిజానికి ధర్మరాజు యింటికి స్టేషన్‌కూ నడుమ దూరం ఐదు నిమిషాల నడక.

కాని అవసరం నాది, అవధులుండని యిష్టాలు అతనివి.

టాక్సీ బయలుదేరింది-

యిక్కడ ధర్మరాజు గురించి రెండు మాటలు చెప్పాలి.

ధర్మరాజు మా ఏరియా మాజీ మున్సిపల్ కౌన్సిలర్. మున్సిపాలిటీలో అడుగు పెట్టాక చెత్తలో నుండి నోట్లను ఎలా పుట్టించవచ్చో తెలుసుకున్నాడు. తను ఆడవలసిన అసంఖ్యాకమైన నాటకాల్లోని అన్ని పాత్రలకూ సరిపోయే కాస్ట్యూమ్ ఖద్దరేనని గ్రహించాడు. పెద్దవాళ్ళ దగ్గర వాళ్ళ గదుల్లో కాళ్ళుపట్టి, కుక్కలా మొరిగి యికిలించి, బయటికొచ్చి అలగా జనంమీద ఎంత రంజుగా స్వారీ చేయవచ్చో నేర్చుకున్నాడు.

ధర్మరాజు మున్సిపల్ కౌన్సిలర్‌గా పోటి చేయక పూర్వం ఓ బట్టల మిల్లులో రోజువారి కూలిపని చేశాడు ఓ పదేళ్ళు. అప్పుడతనికి మిగిలింది పదివేల అప్పు. ఖద్దరు కట్టిన పదేళ్ళలో పది యిండ్లనూ యిద్దరు పెళ్ళాలనూ, నాల్గు అల్సేషియన్ కుక్కలనూ, బ్యాంకుల్లో వేలకు పైబడి ఏడంకెలను దాటని బ్యాలెన్సునూ సంపాదించాడు.

నేను.......

ఉన్న ఒక్క తల్లిని కూలీపనిలో సబ్బుబిళ్ళలా అరగదీసి ఆమె చెమట నుండి ఎమ్మెస్సీ ఫస్ట్‌క్లాస్‌ను సంపాదించాను.

ఎమ్మెస్సీ పట్టాను తీసుకుని బయటి కొచ్చాక దాని వెనుక ఈ దేశం తగలబడుతూ కనిపించింది.

తిరిగి తిరిగి- యింటర్వ్యూలకు వెళ్ళి వెళ్ళి.... జీవితం భూమిపుండు లోదిగ బడ్డట్టు- కదిలిన కొద్దీ యింకా లోపలికి కూరుకుపోవడమే.

ఎటు చూచినా శూన్యమే.

పస్తులు.... కన్నీళ్ళు.... అర్థింపులు.. ఆక్రందనలు... రాత్రుళ్ళు.... పగళ్ళు-

అలసి.... అలసి-

ఏంజేయాలి..... ఏంజేయాలి?

ప్రశ్నలో కూలిపోతుంటే... ఓరోజు ధర్మరాజు కనిపించి ధర్మరాజులా నవ్వి పిలిచాడు.

పిలిచి... "యీసారి ఇంటర్వ్యూ కాల్ వస్తే నాకు చెప్పు, అది నీకిప్పించకుంటే నన్ను చెప్పుతోకొట్టు" అన్నాడు.

యిప్పుడు హైద్రాబాద్‌లో యింటర్వ్యూ వచ్చింది "పద" అన్నాడు. అని ఓ ఐదు తీస్కరా నీ సంగతి తేల్చి పారేస్తా పొమ్మన్నాడు.

ఐదుకు ఒకట్లు పదులు, వందలు.... యిలా గుణించి...

ఈ దౌర్భాగ్యపు దేశంలో పుట్టినందుకు అమ్మలో మిగిలివున్న ఆఖరి ఊపిరిని కూడా వడగట్టి-

బయలుదేరాను రాజధానికి.

నేను చేస్తున్నది "పైరవీ"- ధర్మరాజు నా పైరవీకార్.

స్టేషన్‌లోకి నడిచాక- హుందాగా రెస్టారెంట్ కౌంటర్లో నిలబడి ఓ పాకెట్ గోల్డ్‌ఫ్లాక్.... కింగ్ సైజ్ తీసుకుని, నాలుగయిదు ఇంగ్లీషు.... మ్యాగజైన్స్ తీసుకుని వద్దంటున్నా నాకూ తనకూ రెండు పైనాపిల్ జ్యూస్ బాటిల్స్ తీసుకుని-

నాగుండె దడదడలాడుతోంది

ట్రెయిన్ రానే వచ్చింది నా పైకే వస్తున్నట్టు.

ధర్మరాజు సిగరెట్టు వెలిగించుకుని రైలు దిక్కు నడిచాడు.

"ఏయిటీన్ ".... బిల్లు.

ఏడుస్తున్న హృదయంతో నవ్వుతూ నోట్లిచ్చి-

ధర్మరాజు వెంట బొచ్చు కుక్కలా...

అతను నల్లకళ్ళజోడు పెట్టుకుంటూ "మన సీటెక్కడోయ్..." అన్నాడు.

ఎంత అహంరా వీడికి... సీట్లు కూడా కనిపించనంత పొగరొచ్చింది.... అక్కర కోసం వీనికి బానిసలా... ఛీఛీ

నవ్వుతూ..... "యిదేమిట్సార్ ఫోర్అండ్ ఫైవ్"

కూర్చున్నాడు అతని చేతిలోని బ్రీఫ్‌కేస్‌ను నాకిస్తూ... పోర్టర్‌లా దాన్నందుకుని పైన పెట్టి.... అతనికెదురుగా భయం భయంగా వినయంగా ఒదిగి కూర్చుని-

రైలు సికింద్రాబాద్ చేరేలోగా రెండు సార్లు కాఫీలు తాగి, ఓసారి స్వీట్ తిని యింకో గోల్డ్‌ఫ్లాక్ డబ్బా తీసుకుని-

నేనిస్తున్న ప్రతి రూపాయి వెనుకా అమ్మ దీనమైన ముఖం... ఆమె కళ్ళలో కొన ఊపిరితో ఉన్న ఆశా కనిపిస్తున్నాయి.

ఈ ఐదు వందలు తేవడానికి అమ్మ గాజులు.... చివరికి మంగళసూత్రంకూడా అమ్మి.... అమ్మ బోసిగా.... హే భగవాన్

సికింద్రాబాద్‌లో దిగేసరికి ఎనిమిది దాటింది.

ఎదురుగా బస్ స్టాప్‌లో ఎక్కువగా జనంలేరు. చలి పులిలా భయపెడుతోంది ప్రజలను.

"యిప్పుడేంజేద్దామంటారు" అన్నాను.

"ఏం జేయడమేమిటి... హోటల్లో ఉందాం- ఏయ్ టాక్సీ..." అని పిలిచాడు ఓ కారును.

ఎదురుగా ఖాళీ బస్సులున్నాయి.... ఆటోలున్నాయి- అవన్నీ అక్కర్లేదు. కారే కావాలీ ఆగర్భ కుభేరునికి-

కారు పరుగెడుతోంది ఖాళీ రోడ్లపై తెగిన చుక్కలా.

రూపాయలకు రూపాయలనే మారుస్తున్న మీటర్‌వంక సముద్రంలా అరుస్తున్న గుండెలతో చూస్తున్నాను.

కారును ఎటో పోనీమన్నాడు.

తీరా దిగాక అది ధర్మరాజు కూతురిల్లు. లోపలికెళ్ళి ఓ అరగంట మాట్లాడొచ్చాడు. అక్కడినుండి బయలుదేరి మళ్ళీ యింకో చోటికి అది అతని ఆప్తమిత్రుని యిల్లట.... మళ్ళీ వెయిటింగ్.... వెయిటింగ్‌లో కూడా మీటర్ నా గుండెలా నడుస్తూనేఉంది వేగంగా.

టక్ టక్ టక్ టక్-

నా గుండెల చప్పుడు నాకే వినబడుతోంది పెద్దగా

చివరికి తొమ్మిదిన్నరకు ఓ ఏడంతస్తుల భవనం ముందాగి-

యిరవైనాల్గు ... యిరవైనాల్గు.... మీటర్లోని యిరవైనాల్గు - చెవులో అరుస్తోంది.

ధర్మరాజు దిగి సిగరెట్టు వెలిగించుకుంటూ -

మీటర్‌లో రూపాయలు యిరవై నాల్గిచ్చి .... అతని బ్రీఫ్కేసూ నాసంచీ తీసుకుని దిగి... తలెత్తి చూస్తే.. "హోటల్ స్వర్ణశీల" అన్న వెలిగే అక్షరాలు ప్రాణమొచ్చిన మెరుపుల్లా నవ్వుతున్నాయి.

రిసిప్షన్ కౌంటర్లో- ధర్మరాజు ఎంక్వయిరీ చేస్తున్నాడు.

"ఆరవ ఫ్లోర్‌లో 608, 609కి రా" అని వెళ్ళిపోయాడు ధర్మరాజు.

యిద్దరికి రెండు రూమ్‌లెందుకో- భయం.... ఒక్కో రూమెంతో...యింకా భయం... గుండెలు భయంతో నిప్పు పైబడ్డ పచ్చి ఆకులా ముడుచుకుపోతున్నాయి.

"పే యాన్ అడ్వాన్సాఫ్ టుహండ్రెడ్ రూపీస్-"

ఏమనగలను.... ఏమంటానికీ వీల్లేదు.

రెండు వందల రూపాయల నోట్లను అందించాను. రెండు బరువైన తాళం చెవులను బాయ్‌కు అందించి-

లిఫ్ట్‌లోకి నడిచాం.

ధర్మరాజు అప్పటికే పైకి వెళ్ళిపోయినట్టున్నాడు

రూమ్స్‌లోకి ప్రవేశించి.... బాయ్‌కు బక్షీసిచ్చి ... కుర్చీలో కూలబడి-

గదిలో ఫోమ్ బెడ్స్, నేలనిండా మెత్తని తివాచీ... గోడలపై అందమైన ఆర్ట్‌ప్లేట్స్.... బాల్కనీ... ఆ సౌకర్యాలను ఎన్నడూ ఊహించనైనా ఊహించలేదు నేను.

మరో పది నిమిషాల్లో- ఎవరో బాయ్ ఓ చిన్న బండిలో సీసాలనూ, చికెన్, మటన్ డిషెస్‌నూ, నలుగురైదుగురు తినగలిగే భోజనాన్ని తీసుకొచ్చి- టేబుల్‌పై సర్దడం ప్రారంభించి-

"ఎవరు చెప్పారు...." అని మాట రాక ఆగి-

"ధర్మరాజు గారట... ఫోన్లో యిచ్చారు ఆర్డర్...."

నేను యింకేదో అనబోతూండగా ధర్మరాజు నాకు యమధర్మరాజుగా కనబడడం మొదలైంది.

"ఏమోయ్ నువ్వు పుచ్చుకుంటావా?"

"లే... లేద్సార్..."

"అంటే బుద్ధిమంతుడవన్నమాట.....

"నాకు బుద్ధిగా వుండడం యిష్టంలేదు. ఎందుకంటే బుద్ధునితోనే బుద్ధిమంతులకు కాలం చెల్లిపోయింది-" అని గ్లాసులో వంచుకుని గడగడా తాగుతూ-

తినడానికి మాత్రమే యీ మనిషి పుట్టాడా అని అనిపించేంత పరమ అసహ్యంగా ఆవురావురుమని తింటున్నాడు.

నా తలనిండా... నోట్లు కదులుతున్నాయి... నోట్లు ఏడుస్తున్నాయి... నోట్లు అరుస్తున్నాయి... నోట్లు కరుస్తున్నాయి.

అంతా అయ్యేక... ఫోన్ వుండబట్టి ఎవరెవరికో ఓ యిరవై కాల్స్ చేసి మాట్లాడి- చివరగా ఎవరితోనో "వెంటనే పంపించు... రూమ్ నంబర్ ఆరువందల ఎనిమిది" అని రిసీవర్‌ను ఫోన్ పైకి విసిరేసాడు.

విసిరేసి... బెడ్‌లోకి వెల్లకిలా ఒరిగి రేపుదయం మనం మినిస్టర్ గారింటి కెళ్దాం. పనైపోద్ది. యిప్పుడే ఫోన్ చేశానుగదా. ఊళ్ళోనే ఉన్నారట... ఊ...ఐతే... నువ్విక, పక్కరూంలోకి వెళ్ళి పడుకో...' అని యింకేదో అంటూండగా గది తలుపు మెత్తగా కదిలి... మల్లెపూల వాసన గాజుల చప్పుడుతో సహా ముంచుకొచ్చింది.

తల అటు త్రిప్పి-

ఆమె తెలుగు సినిమాలో సతీ అనసూయ వేషంతో కనిపించే పదహారణాల పతివ్రతలా ఉంది.

వస్తోంది వయ్యారంగా... ఉప్పొంగిన గంగలా.

తల వంచుకున్నాను... తల దించుకున్నాను యీ దేశంలో పుట్టినందుకు.

లేచి సంచీని తీసుకుని బయటకు నడిచి.... 609లో

ఫోమ్ బెడ్‌పై అంపశయ్య మీద పడుకున్నట్టు రాత్రంతా దొర్లుతూ-

అమ్మా... అమ్మా... నీ చెమటలో నుంచి, నీ కన్నీళ్ళలోనుంచి... నీ రక్త మాంసాలనుంచి... నీ మెడలోని మంగళ సూత్రాల్లోంచి నా చేతుల్లోకి వచ్చిన యీ ఒక్కొక్క నోటు-

చూడు.... బీర్ సీసాలకోసం... చికెన్ పలావ్‌ల కోసం.... నవ్వుతూ కుష్ఠురోగుల దగ్గరనైనా పడుకోగలిగే సతీ అనసూయ కోసం.. సావిత్రిలకోసం-

అమ్మా అమ్మా అమ్మా-

తలనిండా మంటలు... కళ్ళనిండా మంటలు... మనసునిండా మంటలు.

తెల్లవారింది తూర్పుదిక్కు సూర్యుడు నా హృదయంలా జ్వలిస్తూ,

ఎనిమిదిన్నరకు ధర్మరాజు నోట్లో బ్రెష్‌తో వచ్చాడు "లేచావటోయ్" అని.

తొమ్మిదింటివరకు టిఫిన్ పేరుతో ఓ మామూలు మనిషి రెండ్రోజుల్లో తినేంత సరంజామాను మెక్కి-

మళ్ళీ టాక్సీ బయలుదేరింది- మినిస్టర్ గారింటికి.

మినిస్టర్ ఇంటి వాకిట్లో ఓ మినీ సంత ఉంది.

ధర్మరాజు ఓ చిట్టీ పంపించాడు లోపలికి

నాకు మినిస్టర్ కొత్త... మినిస్టర్ల బంగళాలు కొత్త... ఈ వాతావరణం కొత్త- తీర్థంలో పసివానిలా చూస్తున్నాను.

గంట తర్వాత ధర్మరాజుకు కబురొచ్చింది.

వెళ్ళాడు.

" ఎంతయినా ఫర్వాలేదమ్మా... పనైపోయి- ఉద్యోగం దొరికితే... అమ్మా... నీ పాదాలను పూజించుకుంటా-..."

కాని గోడకుకొట్టిన బంతిలా వెంటనే తిరిగొచ్చాడు ధర్మరాజు నవ్వుకుంటూ. వచ్చి- 'నీ సంగతంతా చెప్పానోయ్.. మధ్యాహ్నం కలువమన్నారు... పద... నీకు యింటర్వ్యూ పదకొండింటికుంది గదా. నువ్వెళ్ళు... వెళ్లిరా మళ్ళీ సాయంకాల వద్దామిక్కడికి. నేను హోటల్లో ఉంటా- ఓ ట్వంటి యివ్వు-" అని ఓ టాక్సీ తీసుకుని నా మెదడు తిమ్మిరినుంచి కోలుకోకముందే జారుకుని-

పిచ్చివానిలా నిలబడ్డాను.

తర్వాత నడచి నడచి-

యింటర్వ్యూలో... వాళ్ళేమడుగుతున్నారో, ఎందుకడుగుతున్నారో వాళ్ళకే తెలియదు. కాని ఏదో చెప్పాలి కాబట్టి అడిగితే చెప్పాను అన్నీ.

కాని ఉన్న ఉద్యోగాలు రెండు- అభ్యర్థులు ఎనభై ఆరు మంది.

కాళ్ళీడ్చుకుంటూ హోటల్‌కొచ్చాను.

ఆరువందల ఎనిమిది కాలింగ్ బజర్ నొక్కితే...

ధర్మరాజు... అతనితోపాటు రాత్రిదికాని మరో సతీఅనసూయ... శృంగార గాథ క్రీడా ముద్రలో మునిగి ఉన్నట్టున్నారు.... కళ్ళనిండా కోపంతో....ముఖంనిండా ఆకలితో వచ్చాడు..

నేను ఇంటర్వ్యూలో జరిగిన దాని గురించి చెప్పింది విన్నట్టు నటించి....

"నీ గదికిపో... తర్వాత మాట్లాడుకుందాం" అన్నాడు. "మ్యానర్‌లెస్ బ్రూట్" అని విసురుగా విసుక్కోవడం తర్వాత వినిపించింది.

గదిలోకి వచ్చి....

గిరాగిరా తిరుగుతున్న పాన్‌లోకి చూస్తూ...

ఓ గంట తర్వాత బాయ్ బజర్ నొక్కి లోపలికొచ్చి- "మీ అడ్వాన్సయిపోయింది సార్... యింకో నాల్గు వందలిమ్మంటున్నారు-" అని ఓ కాగితమందించాడు.

టు డేస్ రెంట్ సెవెంటీ-లిక్కర్స్, మీల్స్, టిఫిన్స్ ఎనభై.. ఫోన్‌కాల్స్ ముప్పయి- ప్రక్కన తెల్ల చీటీపై నైట్-1 హండ్రెడ్, డే-1 హండ్రెడ్- తల తిరుగుతోంది.

తలనిండా సీసాలు.... అనసూయలు, సావిత్రులు-

అమ్మా... అమ్మా అమ్మా అమ్మా...

గుండెలనిండా ప్రళయాలు... ప్రళయాలు-

నాలో కోటి అగ్ని పర్వతాలు బ్రద్దలౌతున్నాయి.

ఏంజేయాలి... ఏం జేయాలి?

ప్రశ్న... ప్రశ్న... ప్రశ్న

ప్రశ్న వెనుక దీనంగా... కళ్ళనిండా నీళ్ళతో అమ్మ

"అమ్మా..."

★ ★ ★

రాత్రి పదిగంటలయిందిప్పుడు.

ధర్మరాజు మినిస్టరింటికెళ్ళొచ్చాడు "యీసారీ ఉద్యోగాలను వాళ్ళ మేనేజింగ్ డైరెక్టర్ మేనల్లునికీ, యింకొకడెవరికో యిస్తున్నారట. నెక్ట్ ఛాన్స్ మనకిస్తారట-"

నెక్స్ట్... నెక్స్ట్-

ఎప్పుడు... ఎప్పుడు?

తలనిండా డైనమైట్లు ప్రేలుతున్నాయి.

పిచ్చికుక్కనై పోతున్నాను.

అమ్మకు యిక నా ముఖం చూపించలేను... చూపించలేను.

అమ్మ కళ్ళలోకి చూడలేను-ఎలా... ఎలా... ఎలా?

★ ★ ★

ఇన్‌స్పెక్టర్ ఉత్తరాన్ని చదవడం ఆపి చుట్టూ చూశాడు.

ఆగిన రైలింజన్ నడుస్తూనే ఉంది "డ్‌డ్‌డ్‌డ్‌డ్..."

క్రింద పట్టాలప్రక్కన తల ఒక వైపు... మొండెం మరోదిక్కూపడున్న యువకుని శవంచుట్టూ ఎర్రగా... సింధూరంలా రక్తం చింది.

జనం జాలిగా, ఆందోళనగా, భయంగా చూస్తున్నారు గుమిగూడి.

రైలు చక్రాలకు రక్తం అంటుకుని-

చక్రాలు ఎదురు చూస్తున్నాయి. యోజనాలకుమేర ఈ దేశాన్ని ప్రశ్నించబోయే ప్రశ్నల్లా.

ఇన్‌స్పెక్టర్ కన్నీళ్ళలోంచి చదువుతున్నాడు మళ్ళీ-

"ఈ నా ఆత్మహత్యకు...

ధర్మరాజు కారకుడు. ఈ కుళ్ళిపోయిన వ్యవస్థ కారణం- నన్ను తయారు చేసిన సమాజం కారణం. నన్ను పోషించలేని యీ ప్రభుత్వం కారణం... నన్ను కన్న యీ దేశం కారణం.

కాదా... కాదా చెప్పండి.

ఆలోచించండి... ఒక్కసారి ఆలోచించండి.

ఓ యువకులారా... ఓ నాయకులారా, ఓ ధర్మరాజుల్లారా... ఒక్కసారి ఆలోచించి చెప్పండి..."

ఇన్‌స్పెక్టర్ తలపైనుంచి టోపీని తీసి పట్టుకున్నాడు... విషాదంగా...

చుట్టంతా గంభీరమైన నిశ్శబ్దం కోటి గొంతులతో ప్రశ్నలను పేలుస్తోంది.

'ఆంధ్రభూమి' మాసపత్రిక
ఆగస్టు 1980